# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 9

**భీమనది కాలువ పనులు వేగంగా సాగుతున్నాయి.** అంతకంటే వేగంగా ఫిరోజ్‌షా కోట నిర్మాణం జరుగుతోంది. సుల్తాన్ ఫిరోజ్‌షా విడిది అని ప్రచారం చేసినా ఆ కట్టడ నిర్మాణమూ, దానికి తరలొచ్చే పనివాళ్ళనీ చూస్తే అది మామూలు రాజవిడిది కాదన్న సంగతి ప్రజలందరికీ తెలుసు. క్రమంగా భీమనది ఒడ్డునున్న ప్రాంతానికి ఫిరోజాబాద్ అని పిలవసాగారు. నది ఒడ్డున చిన్న చిన్న గ్రామాలున్నాయి. అక్కడి ప్రజలు వ్యవసాయం చేసుకునేవారు. సుల్తాన్ కోట నిర్మాణంతో జనసంచారం పెరిగింది. కూలీవాళ్ళు కుటుంబాలతో వచ్చి అక్కడే తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్నారు. ఫిరోజ్‌షా రెండు మూడు సార్లు వచ్చి దగ్గరుండి పర్యవేక్షించాడు. అహ్మద్‌ఖాన్ పరిపాలనా వ్యవహారాలెన్ని వున్నా ప్రతీ వారమూ వస్తున్నాడు.

అహ్మద్‌ఖాన్ విచిత్రమయిన వ్యక్తి. ఎవర్నీ ఒక పట్టాన నమ్మడు, ఒక్క ఫిరోజ్‌షాని తప్ప. బహుశా గతంలో రాజరికం నేర్పిన పాఠమేమో! తన్మతన్‌షా బంధువు తగల్చిన్ వ్యవహారం అతని స్మృతి పథం నుండి ఇంకా చెరిగిపోలేదు. రాచరికంలో ఎవరెప్పుడు మిత్రులవుతారో, శత్రువులవుతారో తెలీదు. ఎంతో అభిమానంగా గౌరవించిన తన్మతన్‌షా తల్లి యాస్మిన్, తగల్చిన్ చెప్పుడు మాటలువిని తమ్ముళ్ళనే చంపడానికి సిద్ధమయ్యాడు. చివరకి తగల్చిన్నే తన్మతన్‌షాని చంపడానికి సిద్ధమయ్యాడు. రాజ్యకాంక్షకి రక్తసంబంధంతో పనిలేదు. అధికారం కత్తిలాంటిది. రక్త బిందువుల మెరుపుకి దాసోహమంటుంది.. చరిత్ర చెప్పిన పాఠం అహ్మద్‌ఖాన్‌కి బాగానే వంటపట్టింది. అందువల్లే అందరిపైనా ఒక కన్నేసుంచుతాడు, సుల్తాన్ ఫిరోజ్‌షాతో సహా!

అందుకే కోట నిర్మాణం తన భుజాలమీదుగానే నడిపిస్తున్నాడు. ఫిరోజ్‌షా కి హసన్ ఖాన్ అనే కొడుకున్నాడు. హసన్ ఖాన్‌కి పందొమ్మిదేళ్ళు. ఎప్పుడూ మంద్యం సేవిస్తూ, గానా బజానాల మధ్య మునిగి తేలుతూ ఉంటాడు. అతనికేవీ పట్టవు. అహ్మద్‌ఖాన్‌కి అతని గురించి తెలుసున్నా ప్రత్యేకంగా పట్టించుకోడు. ఎందుకంటే అతని కన్ను రాజ సింహాసనమ్మీదుంది. ఫిరోజ్‌షా రాజ్యం విస్తరించి అందులో కొంత భాగానికి తను సుల్తాన్ కావాలి. లేదా ఫిరోజ్‌షా తదనంతరం తనే సుల్తాన్ కావాలి. ఫిరోజ్‌షా వారసులెవ్వరూ అధికారం దగ్గరకి రాకుండా జాగ్రత్త పడుతూనే ఉంటాడు. హసన్‌ఖాన్ రాజకీయ వ్యవహారాలకెంత దూరంగా ఉంటే అతనికంత మంచిది. హసన్‌ఖాన్ ఎంతసేపూ మిత్రులతో కాలక్షేపం చెయ్యడం, సమయం దొరికితే వేటకి వెళ్ళడం ఇదే అతని జీవితం. ప్రజలక్కూడా అతను సుల్తాన్ కొడుకూ, వారసత్వాధికారంలో అన్నీ కలిసొస్తే కాబోయే సుల్తానూ అన్న భావనే లేదు. గుల్బర్గా రాజ్యం మొత్తం చక్రం తిప్పేది అహ్మద్‌ఖానే!

ఫిరోజ్‌షాకీ కొడుకు గురించి అంతగా పట్టదు. పట్టించుకునే తీరికా లేదు. కానీ ఫిరోజ్‌షా భార్య రెహానాకి కొడుకు హసన్ గురించి ఎప్పుడూ దిగులే! ఎన్నో సార్లు చెప్పి చూసింది. అతనికి తల్లి మాటలంటే నిర్లక్ష్యం. తండ్రిలాగూ చెప్పడు. రెహానా ఫిరోజ్‌షాకి చెప్పి చెప్పి విసిగిపోయింది. ఈ లోకంలో ప్రతీ తల్లీ తన సంతానం ప్రయోజకులు కావాలనే కాంక్షిస్తుంది. రాణయినా, రాళ్ళు కొట్టే స్త్రీ అయినా కోరేదదే!

ఆనాడు హసన్‌ఖాన్ జన్మదినం. ఉదయాన్నే కొడుకొస్తాడనీ, ఆశీర్వదించాలనీ అనుకుంది. ఎన్ని పనులున్నా మధ్యాన్నం భోజనానికి తన నివాసానికే రమ్మనమని కొడుక్కి కబురంపింది. ఫిరోజ్‌షాకీ ఒకటికి రెండుసార్లు చెప్పింది. జన్మదిన వేడుక విందు ఏర్పాట్లన్నీ తన - దగ్గర బంధువయిన మెహజబీన్ స్వయంగా దగ్గరుండి చూసుకుంటోంది. మెహజబీన్‌క్కూడా హసన్ అంటే అభిమానమే! అతనికంటే కొన్ని నెలలు చిన్న. దాదాపు ఇద్దరిదీ ఒకే వయస్సు. చిన్నప్పటినుండీ కలిసి పెరిగారు.

మెహజబీన్ తన్మతన్‌షా బావమరిది కూతురు. తన్మతన్‌షా అధికారం కోల్పోయాకా పరిస్థితులు తిరగబడ్డాయి. అతని కొడుకు తగల్చిన్ తిరుగుబాటులో చనిపోయాడు. తన్మతన్‌షాకి కళ్ళు పొడిచేసారు. అధికారం పోయింది. దానితో పాటూ వాళ్ళ ప్రాపకమూ తగ్గింది. మెహజబీన్ తండ్రి ఫిరోజ్‌షా పాలనా వ్యవహారాలు చూసే ఒక అధికారి. అన్నీ సవ్యంగా జరుగుంటే తన్మతన్‌షా కొడుకుని మెహజబీన్ కిచ్చి పెళ్ళి జరిగుండేది. మెహజబీన్ రాణయ్యుండేది. కాలం కలిసి రాకపోతే ఓడలు బళ్ళవుతాయి. బళ్ళు ఓడలవుతాయి. ఫిరోజ్‌షా భార్య రెహానా ఒక చిన్న భవంతిలో ఉండేది. తన్మతన్‌షా భార్య అప్పటి మహారాణి. ఆమె తమ్ముడు ప్రధాన మంత్రి కావల్సుండేది. అన్నీ తిరిగబడ్డాయి. సుల్తానా రెహానా గతం మర్చిపోలేదు. కళ్ళముందు వారి వైభవం చూసింది. అందుకే అభిమానంతో తన పనులన్నీ చక్కదిద్దే కార్యం మెహజబీన్‌కి అప్పగించింది. పేరుకి రెహానా సుల్తానాయే కానీ, మెహజబీన్ ఏం చెబితే అలా చేస్తుంది. మెహజబీన్ హవా ఆ హవేలీ లో బాగానే చెల్లుబాటవుతుంది. సుల్తానా వ్యవహారాలన్నీ మెహజబీనే చూస్తుంది. మెహజబీన్ క్కూడా సుల్తానాఅవ్వాలన్న కోరిక గాఢంగా ఉంది. సుల్తానా పేరు చెప్పుకొని అక్కడ కొన్ని కోరికలు తీర్చుకుంటుంది. ఎప్పటికయినా గుల్బర్గా సుల్తానా అవ్వడమే మెకున్న ఏకైక లక్ష్యం.

ఎప్పటికయినా రెహానా మెప్పు పొంది తద్వారా హసన్‌ఖాన్‌కి హసన్ని పెళ్ళాడలన్నదే ఆమె కోరిక. పైకి చెప్పకపోయినా హసన్‌ఖాన్ని గాఢంగానే ప్రేమిస్తోంది.

ఆనాటి వేడుకలక్కూడా ఆమే అన్ని ఏర్పాట్లు చూస్తోంది.

సుల్తానా రెహానా కూడా కొడుకు రాక కోసం ఎదురుచూస్తోంది. పెందరాళే రమ్మనమని ముందురోజే కబురు పంపింది.

భర్త ఫిరోజ్‌షా ఎన్ని పనులున్నా రోజుకొకసారయినా తన మందిరానికి వస్తాడు. రాత్రి ఎప్పుడూ ఆలస్యంగా వస్తాడని సుల్తాన్ కోసం ఎదురుచూడదు. కొడుకు మాత్రం దీనికి వ్యతిరేకం. ఎప్పుడో వారానికో పదిరోజులకో తోచినప్పుడు వస్తాడు. ఎంతసేపూ గానా బజానా, స్నేషితులూ అదే అతని ప్రపంచం. ముందురోజు ఆహ్వానం పంపింది కాబట్టి వస్తాడని ఎదురుచూస్తోంది. మధ్యాన్నం భోజన వేళ సమీపిస్తున్నా హసన్‌ఖాన్ రాలేదు. ఉండబట్ట లేక మెహజబీన్ని అడిగింది.

"జబీన్! హసన్‌కి కబురు సరిగ్గా అందిందా?"

"పరిచారికలయితే అంతగా పట్టించుకోరని స్వయంగా నేనే వెళ్ళి చెప్పాను. వస్తాననే చెప్పారు."

రెహానా కంటే మెహజబీనే ఎక్కువగా ఎదురుచూస్తోంది. వస్తే అతనితో గడపవచ్చనే ఆశతో ఉంది.

నిన్న హసన్‌ఖాన్ నివాసానికి వెళ్ళేసరికి స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తూ కనిపించాడు. ఆ మత్తులో తన మాటలు బుర్రకెక్కాయో లేదో తెలీదు. అందుకే అతనెక్కడ మర్చిపోతాడోనని దగ్గరున్న అధికారులక్కూడా మర్నాడు హసన్‌ఖాన్ జన్మదినం గురించి చెప్పి వచ్చింది. మద్యం సేవిస్తున్న సంగతి సుల్తానా రెహానాకి చెప్పలేదామె. చెబితే రెహానా బాధపడుతుంది. పదిమంది ద్వారా కొడుకు నిర్వాకం గురించి విన్నప్పుడల్లా రెహానా బాధపడడం మెహజబీన్‌కి తెలుసు. రెహానాని కష్టపెట్టడం ఇష్టం లేకపోయిందామెకి.

ఆ మందిరంలో ఇద్దరూ హసన్ రాకకై వేచి చూస్తున్నారు. అప్పటికే రాజమందిరపు అయిదో గంట వినిపించింది. ఉదయం మూడో గంటకల్లా రమ్మనమని చెబితే ఇంతవరకూ పత్తా లేదు.

"సుల్తాన్ హసన్ని చూస్తే చాలా దిగులుగా ఉంటోంది. ఎప్పుడూ స్నేహితులతో గానా బజానాలూ, వేడుకలూ. సుల్తాన్ ఫిరోజ్‌షాకి కాస్త సహాయంగా రాజ్య నిర్వహణలో పాలుపంచుకోమని ఎన్నో సార్లు చెప్పినా ప్రయోజనం లేకపోయింది...సుల్తాన్ వచ్చే వేళయ్యింది. వారొచ్చే సరికి హసన్ రాకపోతే ఏమంటారోనని భయంగా ఉంది.." రెహానా గొంతు మారింది.

"వచ్చేస్తారు. రాత్రి పడుక్కోవడం ఆలస్యమయ్యుండవచ్చు. లేదా ఉదయమే మసీదుకెళ్ళుండవచ్చు. కంగారు పడకండి. " సర్ది చెప్పింది కానీ మెహజబీన్‌కి రెహానా మాటల్లో దుఃఖం తెలుసు.

ఎంతసేపటికీ హసన్ జాడ లేదు. ఫిరోజ్‌షా విచ్చేస్తున్నట్లుగా సేవకులు వార్త తెచ్చారు.

రెహానాకి కంగారు మొదలయ్యింది. మెహజబీన్‌కి మనసులో అదే పరిస్థితి వున్నా పైకి మాత్రం గంభీరంగానే ఉంది. ఫిరోజ్‌షా వచ్చేసరికి హసన్ అక్కడ లేకపోతే ఫిరోజ్‌షా మండిపడడం ఖాయం.

రెహానా కంగారూ, భయం గుర్తించిన మెహజబీన్ - "సుల్తానా! నేను హసన్ మందిరానికి వెళ్ళి అతన్ని తోడ్కొని వస్తాను. ఒకవేళ సుల్తాన్ వస్తే నేనూ, హసనూ బయటకి వెళ్ళామని సర్ది చెప్పండి..కంగారు పడద్దు." అంటూ ధైర్యం చెప్పి వెళ్ళింది.

కొంతసేపటికి ఫిరోజ్‌షా సుల్తానా మహల్లో ప్రవేశించాడు.

000000000000

మెహజబీన్ వెళ్ళేసరికి హసన్ ఇంకా నిద్రమత్తు నుండి లేవలేదు.

అక్కడున్న సేవకుల్ని అడిగింది, ఏమయినా అనారోగ్యం చేసిందాని. వాళ్ళెవరూ సమాధానం చెప్ప లేదు. అందులో ఒకతను మెల్లగా చెప్పాడు.

"అమ్మా! నిన్న రాత్ర పొద్దుపోయేవరకూ మద్యం సేవిస్తూనే ఉన్నారు. ఎవరు చెప్పినా విన లేదు. తెల్లవార్లూ ఇదే తంతు. ఈ ఉదయమే పడుక్కున్నారు. ఇలా అయితే సుల్తాన్ రోగ్యం చెడిపోతుందేమోనని భయంగా ఉంది. ఆయనతో చెప్పే ధైర్యం మాకు లేదు. అందుకే..."

మెహజబీన్‌కి విషయం అర్థమయ్యింది. హసన్‌ఖాన్‌కి తల్లి అంటే లెక్కలేదు. తండ్రి మాట పట్టించుకోడు. తనకి చెప్పే చనువు వుంది. ఎన్నో సార్లు చెప్పింది కూడా. అతను మెహజబీన్ని కూడా లక్ష్య పెట్టలేదు. ఎన్ని అవమానాలు జరిగినా మెహజబీన్‌కి అతనంటే ప్రేమ. ఎప్పటికయినా మారకపోతాడాన్న చిన్న ఆశ. ఆ వెలుతురు కోసమే ఆమె ఎదురుచూపు.

సరాసరి హసన్ పడగ్గదిలో ప్రవేశించింది. ఒక పక్క బల్ల మీద ఖాళీ చేసిన మద్యం పాత్రలు చెల్లా చెదురుగా పడున్నాయి. అక్కడక్కడ కొన్ని స్త్రీల మేలి ముసుగు వస్త్రాలు పడున్నాయి. గదంతా హుక్కా వాసన వేస్తోంది. పక్క మీద హసన్ గాఢ నిద్రలో ఉన్నాడు. గదంతా కలయ చూస్తే మెహజబీన్‌కి బాధ కలిగింది. ఎందుకిలా తయారయ్యాడు? జీవితమంటే తాగడం, అనుభవించడం తప్ప ఇంకేమీ లేదా? హసన్‌కి మనుష్యులంటేనే కాదు; జీవితమన్నా లక్ష్యం లేదు అన్న సంగతి ఆ క్షణం మెహజబీన్‌కి బాగా అర్థమయ్యింది.

హసన్ని నిద్ర లేపడానికి ప్రయత్నించింది. అతను కళ్ళు తెరిచే స్థితిలో లేడు. బలవంతాన కళ్ళు తెరిచినా అతనే చెబుతున్నాడో సరిగా తెలీలేదు. మాటలు ముద్దగా, మత్తుగా వస్తున్నాయి. అతను ప్రస్తుతం రెహానా మందిరానికి రాలేడన్న సంగతి తెలిసి తిరుగు ముఖం పట్టింది మెహజబీన్!

ఎప్పటికయినా హసన్ సుల్తాన్ అవుతాడా అన్న ఆశ వడికట్టిపోతోంది. ఇదంతా తలచుకుంటే మెహజబీన్ కళ్ళలో కన్నీళ్ళు అప్రయత్నంగా వచ్చాయి. నిస్సహాయ స్థితికి ప్రతీకలే కన్నీళ్ళు. ప్రస్తుతం ఆమెకున్న ఆస్తి అవొక్కటే! అంతకుమించి ఆమెవద్ద ఏమీ లేవు.

00000000000

నిరాశగా రెహానా మందిరం వైపుగా సాగింది మెహజబీన్!

వెళ్ళేసరికి ఫిరోజ్‌షా అక్కడే ఉన్నాడు. అతని ముఖంలోనూ విచారం కనిపిస్తోంది. బహుశా హసన్ గురించి రెహానా చెప్పి ఉండచ్చు.

మెహజబీన్ని చూడగానే హసన్ వచ్చాడా అన్నట్లు తలెత్తి చూసాడు ఫిరోజ్‌షా.

"ఏమయ్యింది? హసన్ వస్తున్నాడా?" రెహానా ప్రశ్నకి మెహజబీన్నుండి మౌనమే సమాధనం వచ్చింది.

రెహానా మరలా రెట్టించే సరికి విషయం చెప్పింది.

"ప్రస్తుతం నిద్ర లేచే స్థితిలో హసన్ లేడు. మీరు అతని కోసం ఎదురుచూడడం వృథాఏమోనని నాకనిపిస్తోంది.." మెల్లగా అంది.

రెహానా కళ్ళల్లో కన్నీళు చూసి చలించిపోయాడు ఫిరోజ్‌షా.

"అనవసరంగా బాధ పడకు. నేనే మనబ్బాయికి నచ్చి చెబుతాను. లేదా పెద్దల చేత చెప్పిస్తాను. నా మాట నమ్ము..."

"నమ్మకం లేనిది మీ మాట మీద కాదు -మనబ్బాయి హసన్‌ణ మీద. వాడు ప్రయోజకుడు అయితే నాకదే చాలు. అల్లా! నువ్వే మమ్మల్ని రక్షించాలి..." ఏడుస్తూ అంది రెహానా.

మెహజబీన్‌కి ఏం మాట్లాడాలో తెలీలేదు. ఫిరోజ్‌షా ముందు చనువున్నా, భయం కూడా ఉంది.

ఆ మాటలకి ఫిరోజ్‌షా రెహానాని సముదాయించలేదు. కొంతసేపు మౌనం వహించాడు. అతనూ  ఆలోచిస్తున్నాడు. ఏం చేస్తే హసన్ బాగుపడతాడాని?

"ఫిరోజాబాదు కోట పనులు నిర్వర్తించడానికి రాజ్యాధికారిగా నియమిస్తాను. సహాయంగా మంత్రుల్నీ పంపుతాను. ఎలాగూ అహ్మద్ ఖానూ సాయం కావాలని గోల పెడుతున్నాడు. సుల్తాన్ తరపున ఎవరైనా ఉంటే పనివాళ్ళూ శ్రద్ధగా పని చేస్తారు. ఇక్కడే ఉంటే ఈ గానాబజానాలూ అవి తప్పించడం అంత సులభం కాదు.." తన మనసులో మాట చెప్పాడు ఫిరోజ్‌షా.

"సరే! మీ ఇష్టం! ఏదో ఒకటి చెయ్యండి. వాడు దారిలోకి వస్తే అంతంకంటే కావల్సిందేముంది?" రెహానా గొంతులో భాధ ధ్వనిస్తోంది. ఏడుస్తూ మంచమ్మీద కూలబడిపోయింది.

రెహానాని జాగ్రతాగా చూసుకోమని మెహజబీన్‌కి చెప్పి, ఫిరోజ్‌షా మెల్లగా అక్కడనుండి నిష్క్రమించాడు.

వెళ్ళడం వెళ్ళడం సరాసరి దర్బారుకి వెళ్ళాడు. అక్కడ అధికారులతో మంతనాలు చేస్తూ అహ్మద్‌ఖాన్ కనిపించాడు. విచార వదనంతో ఉన్న ఫిరోజ్‌షాని కారణం అడిగితే హసన్ విషయం చెప్పాడు. అలాగే ఫిరోజాబాద్ కోట పర్యవేక్షణాధికారిగా పంపించాలన్న తన మనసులో మాట కూడా చెప్పాడు. అది విని గతుక్కుమన్నాడు అహ్మద్‌ఖాన్!

హసన్ వెళితే తనకి మంచి కంటే చెడే ఎక్కువ జరిగే అవకాశాలున్నాయి. తను ఎంతో చాకచక్యంగా నడుపుతున్న రాజకీయం బయల్పడే అవకాశాలున్నాయి. హసన్‌కి అక్కడి విషయాలు తెలిస్తే తనకి ప్రమాదమే! వద్దంటే ఫిరోజ్‌షాకి అనుమానం రావచ్చు. అలాకాదని ఫిరోజాబద్ పంపిస్తే తన గుట్టూ రట్టు కావచ్చు. ఇన్నాళ్ళూ హసన్ రాజ్య వ్యవహారాల జోలికి రాకుండా జాగ్రత్త పడ్డాడు. అందులో భాగంగానే అతనొక అప్రయోజకుడన్న భావన కలిగించేలా అతనికి ప్రత్యేకంగా ఒక మందిరం ఇప్పించాడు. గానాబజానాలూ, మద్యమూ అమర్చిందికూడా తనే! హసన్ ప్రజల్లోకి వస్తే తన ఉనికే భంగం కలగవచ్చు. ఆలోచిస్తూ సమాధానం చెప్ప లేదు అహ్మద్‌ఖాన్.

అతని మౌనం చూసి ఫిరోజ్‌షాయే తిరిగన్నాడు.

"అహ్మద్! నీకూ భీమనది పనులు చూడడానికి హసన్ సహాయ పడతాడు. ఏమంటావు?"

అహ్మద్‌ఖాన్‌కి ఎప్పుడు ఎవరితో ఎలా మాట్లాడాలో తెలుసు. ఏ విషయం ఓ పట్టాన పైకి తేలడు.

"అలాగే సుల్తాన్! మీరు చెప్పినట్లుగానే చేద్దాం! హసన్ని ఒకసారి ఇక్కడకి పిలిపించండి. అతని ఇష్టం కూడా కనుక్కుని..."

హసన్ ఇష్టమనే సరికి ఫిరోజ్‌షాకి చిర్రెత్తుకొచ్చింది. తమ్ముడి మాటలు ఖండిస్తూ అన్నాడు.

"వాడి ఇష్టం కనుక్కుని చేస్తే జరిగేది కాదు. అభ్యర్థన పట్టించుకోని వాళ్ళకి ఆజ్ఞాపనే మందు. నువ్వు నా మాటగా, మనందరి మాటగా చెప్పు. లేదంటే అతనికి వేట నిషిద్ధమని చెప్పు..నువ్వు ఏం చేస్తావో నీ ఇష్టం. వాడు ఏదో ఒక వ్యాపకంలో మునిగి తేలాలి. మనుష్యుల మధ్య మసిలేలా చెయ్యాలి."

ఫిరోజ్‌షాకి తమ్ముడి మీద చాలా విశ్వాసముంది. అందుకే మనసులో మాట పైకి వెళ్ళగక్కాడు.

పైకి సరే అన్నాడు కానీ హసన్ని దూరంగా ఎలా ఉంచాలా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు అహ్మద్‌ఖాన్.

హసన్ని మార్చే బాధ్యత తనదని అందరిముందూ గట్టిగా చెప్పాడు అహ్మద్‌ఖాన్. అన్నగార్ని నమ్మబలికించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య.

హసన్ బాగుపడతాడని మెహజబీన్‌కి నమ్మకం. రెహానాకి ఫిరోజ్‌షా మీద నమ్మకం. ఫిరోజ్‌షాకి తమ్ముడు అహ్మద్‌ఖాన్ మీద విశ్వాసం. అహ్మద్‌ఖాన్‌కి తన తెలివి తేటలమీద అపారమైన నమ్మకం. తరచి చూస్తే నమ్మకం చుట్టూనే ప్రపంచం గుండ్రంగా తిరుగుతుంది. అదే లేకపోతే ఈ ప్రపంచమే లేదు.

రెహానాకీ,ఫిరోజ్‌షాకీ,అహ్మద్ ఖాన్‌కీ, మెహజబీన్‌కీ ఎవరి నమ్మకాలు వారివి. వాటికి కేంద్ర బిందువు ప్రస్తుతం హసన్!

000000000000

అక్కడ విజయ నగరంలో -

నరేంద్ర గజపతి తన పథకం పారినందుకు లోలోపల ఎంతో ఉప్పొంగిపోయాడు. తన బెదిరింపులకి లొంగి భూషణాచార్యుడు ముద్గల్ వెళ్ళకుండా ఆగిపోయాడు. వేదరాయశర్మ తనూరికి తిరుగుముఖం పట్టాడని విన్నాడు. ఈ విషయాలన్నీ అక్క ఉమాదేవికి చెప్పడానికి ఆమె మందిరానికి వెళ్ళాడు.

వెళుతూనే ఎంతో సంతోషంతో - "అక్కా! నీకో శుభవార్త! ముద్గల్ వెళ్ళాల్సిన భూషణాచార్యుడికి అస్వస్థత చేసి వెళ్ళ లేనని చెప్పాడు. ఎందువల్లో మహారాజు మనసు మార్చుకున్నట్లు కనిపిస్తోంది. ముద్గల్ అమ్మాయిని విజయనగరం తెప్పించుకునే కార్యక్రమం ప్రస్తుతం లేదు..." అని చెప్పాడు.

ఉమాదేవి ఈ మాటలువిని పొంగిపోయింది. సవతిలేని జీవితాన్నే భర్తతో ఏ స్త్రీ అయినా కోరుకుంటుంది. ఆ అవసరం మహారాణిలకీ మరీ ఎక్కువ..

"మరి పెళ్ళి...?" అనుమానమొచ్చి అడిగింది.

"అది పెటాకులయ్యింది. వేదరాయశర్మ ముద్గల్ తిరిగెళ్ళి పోతున్నాడు. కాబట్టి నువ్వు అనవసరంగా దిగులు పడనవసరం లేదు.."

"నిజంగానా!.." అంటూ ఉమాదేవి పైకి అందికానీ లోలోపల ఏదో అపనమ్మకం ఉంది. నిన్నటి వరకూ ముద్గల్ అమ్మాయి నేహలని పెళ్ళాడి తీరుతానన్న దేవరాయలు హఠాత్తుగా అది విరమించుకున్నాడంటే అందులో ఏదో లొసుగుందన్న అనుమానం బయల్దేరింది.

"నిజమే! నా చెవులారా నేను విన్నాను. కావాలంటే నువ్వు ఎవర్నయినా అడిగి తెలుసుకోవచ్చు..అయినా ఈ నరేంద్ర గజపతి తలుచుకుంటే ఎవర్నయినా దెబ్బ తీయగలడు..."

"ఏమో! నా కెందుకో అనుమానంగా ఉంది. నిన్నటి వరకూ పెళ్ళి చేసుకుంటానన్న దేవరాయల మహారాజు ఇలా మనసు మార్చుకున్నాడంటే నమ్మ బుద్ధి కాలేక అడిగానంతే! నీమీద నాకు నమ్మకముంది తమ్ముడూ.."

ఉమాదేవి మాటలు విని కాస్త కుదటపడ్డాడు నరేంద్ర గజపతి.

"అక్కా! ఎందుకయినా మంచిది. నువ్వు బావగారిపై ఒక కన్నేసుంచు. నా ప్రయత్నం నేను చేస్తాను. మన జాగ్రత్తలో మనం వుండడం ఎంతైనా అవసరం. అసలే మనకిది పరాయి చోటు కూడా.."

అలాగే నన్నట్లు తలూపింది ఉమాదేవి.

"తమ్ముడూ! ఎందుకయినా మంచింది ముద్గల్ అమ్మాయి వివరాలు సంపాదించు..."

"ముద్గల్ అమ్మాయి వివరాలా? అవెందుకు?..." ఆశ్చర్యంగా అడిగాడు.

" ఆ అమ్మాయి వివరాలు తెలుసుకో ముందు. ఒకవేళ ఆ అమ్మాయే విజయనగరం వస్తూంటే...? అయినా రాచరికం అంటే ఎవరికి చేదు? "

"దిగులు పడకు. ఆ అమ్మాయి ఈ విజయనగరం పొలిమేరల్లోకి అడుగు పెట్టకుండా చూసే బాధ్యత నాది. అవసరమయితే ఎవర్నయినా చంపడానికి వెనుకాడను..." రోషంతో అన్నాడు.

"నీకు మహారాజు సంగతి తెలీదు. ఏం చేస్తాడో చెప్పడు. ఏం లోచిస్తాడో బయటపెట్టడు. మన జాగ్రత్తలో మనం ఉండాలి. నువ్వు కన్నేసి ఉంచాల్సింది ఆ అమ్మాయి మీద కాదు. మహారాజు మీద. ఎవరికీ అనుమానం రాకుండా మహారాజుని పసిగట్టు. అప్రమత్తంగా ఉండడం మనకే మంచిది. నేనూ దేవరాయలనుండి సాధ్యమయినంత వరకూ విషయాలు తెలుసుకుంటాను. రాచరికంలో అన్ని విషయాలూ అంతఃపురం చేరవు. మద్యమూ, మగువా మగాడి బలహీనతలు; ముఖ్యంగా మహారాజులకి. సమయం చూసే మనం ప్రవర్తించాలి. అందుకే ఈ జాగ్రత్తలన్నీ!"

ఉమాదేవి తమ్ముణ్ణి హెచ్చరించింది.

ముద్గల్ అమ్మాయితో పెళ్ళి జరక్కుండా తమ్ముడు ఆపినందుకు ఆమెకు సంతోషంగానే ఉంది. ఈసారికీ గండం గడిచిందని ఇద్దరూ సంతోషించారు.

నేహలని విజయనగరం తీసుకొని రమ్మని దేవరాయలు వేదరాయశర్మని పంపాడన్న విషయం ఎవరికీ తెలీదు. ముఖ్యంగా ఉమాదేవికీ, నరేంద్ర గజపతికీ!

0000000000000000

హసన్ విషయం తెలిసినప్పటి నుండీ అహ్మద్‌ఖాన్‌కి కంటి మీద కునుకు లేదు. రాచ వ్యవహారాలకి దూరంగా ఉంచితే మంచిదన్న తన ఆలోచన ఇప్పుడు తనకే చుట్టుకునేలా వుంది. హసన్‌ని ఫిరోజాబాద్ పంపడం అతనికి సుతారామూ ఇష్టం లేదు. ఉదయం నుండీ వేరేవి ఎన్నో ఆలోచిస్తున్నా అతని బుర్రలో తిరిగేది హసన్ గురించే!

అతను ఏమరుపాటుగా ఉండడం గ్రహించిన హసన్‌ఖాన్ సహాయ మంత్రి విషయం అడిగాడు.

"హుజూర్! మీరు ఈ మధ్యాహ్నం నుండీ ఏదో విషయమ్మీద ఆలోచిస్తున్నట్లుగా తోస్తోంది. మీరు చాలా పరధ్యాన్నంగా కనిపిస్తున్నారు. మేమా విషయం తెలుసుకోవచ్చా? విచారంలోనూ, ఒత్తిడిలోనూ ఆలోచనలు కుదురుగా ఉండవని అంటారు. మాకు తెలిస్తే మేం నిదానంగా ఆలోచించి తోచింది చెప్పగలం..."

అహ్మద్‌ఖాన్ విషయం చెప్పాడు. హసన్ ప్రవర్తన వల్ల సుల్తాన్ ఫిరోజ్‌షా ఎంతో దిగులు చెందుతున్నాడనీ, అన్నగారి మనోవేదనే తన పరధ్యాన్నానికి కారణమనీ చెప్పాడు తప్ప తన మనసులో ఉన్నది బయట పెట్టలేదు.

"అవును హుజూర్! హసన్ ఖాన్ విషయం రాజ్యమంతా తెలుసు. అతను సుల్తాన్ చేయి దాటిపోయాడు. మీరు చెబితే వింటాడనీ నేనుకోను. మీరీ విషయం మౌల్వీ గిసుదరాజ్‌కి తెలియజేయండి. ఆయనే ఏదైనా దారి చూపిస్తాడు."

సహాయ మంత్రి సలహా అహ్మద్‌ఖాన్‌కి బాగా నచ్చింది. అతను చెప్పింది నిజమే! గిసు దరాజ్ మాటంటే రాజ్యంలో తిరిగులేదు. ఆయన మాటెవరూ కాదనరు. ఎదురుచెప్పే ధైర్యం ఎవరికీ లేదు. ప్రస్తుతం గిసు దరాజ్‌ని శ్రయించి విషయం చెబితే ఏదో ఒక దారి చూపించచ్చు. ముందు హసన్‌ఖాన్ మామూలు మనిషిని చెయ్యాలి. ఆ నెపంతో హసన్ని ఫిరోజాబాదు పనులకి దూరంగా ఉంచచ్చు. దానికి గిసు దరాజే సరైన వ్యక్తి.

సహాయ మంత్రి చెప్పింది అహ్మద్‌ఖాన్‌కి ఎంతో నచ్చింది. తక్షణమే గిసుదరాజ్ నివాసానికి వెళ్ళడానికి ఏర్పాట్లు చెయ్యమని ఆదేశించాడు.

00000000000000000

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library